క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చిలకలూరిపేట: పట్టణంలోని పండరీపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాలలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్‌సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని సింగ్‌నగర్, సాంబశివనగర్, న్యాయస్థానం ప్రాంతాలలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

7న జాషువా కళాప్రాంగణంలో ఉగాది ఉత్సవం

వినుకొండ టౌన్: పట్టణంలోని జాషువా కళా ప్రాంగణం నందు ఈ నెల 7న ఆదివారం ఉదయం 9 గంటలకు రోటరీ క్లబ్ గ్రేటర్ వినుకొండ, కళాసాగరి సాంస్కృతిక సంస్థలు సంయుక్తంగా, ఉగాది ఉత్సవం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు చిరుమామిళ్ల కోటేశ్వరరావు, కూచి రామాంజనేయులు శుక్రవారం పేర్కొన్నారు. ఉత్సవంలో భాగంగా కవిసమ్మేళనం, పంచాంగశ్రవణం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వినుకొండ ప్రాంతంలో వివిధ రంగాలలో విశిష్ట సేవలందిస్తున్న 9 మంది ప్రముఖులకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేస్తున్నామన్నారు. వారితోపాటుగా కవులకు, ప్రతిభావంతులైన గురువులకు, బాలలకు అభినందన సత్కారాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా వినుకొండ మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, పట్టణ సీఐ ఎస్. సాంబశివరావు, ప్రత్యేక అతిథిగా రోటరీ జిల్లా 3150 అసిస్టెంట్ గవర్నర్ ఆలా శ్రీనివాసరావులు హాజరౌతున్నారన్నారు.

గుర్తు తెలియని మృతుడు?




రొంపిచర్ల: మండలంలోని కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వేపై గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడిని ఎవరూ గుర్తించలేదు. మృతుడు సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగి నలుపు బారు చేతుల టీషర్ట్, బ్లూకలర్ జీన్స్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు, మృతుని వివరాలు తెలిసినవారు రొంపిచర్ల ఎస్ఐ, రూరల్ సీఐ నరసరావుపేట వారిని సంప్రదించాలని ఎస్ఐ కోరారు. సెల్ నెం.9440796247, 9440796225 తెలియపరచాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

10న శివాలయం భూముల కౌలు వేలం

నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న శ్రీ సోమేశ్వర వీరభద్రస్వామి వార్ల దేవస్థాన భూముల బహిరంగ కౌలు వేలం ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ ఈవో ఎన్ తులసీదాస్ చెప్పారు. దేవస్థానం ఆవరణలో ఉదయం 10 గంటలకు జరిగే బహిరంగ వేలంలో గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నెం.305, 308, 281-3, 281-1ఎ-1సి లలో మొత్తం 29.39 యకరాల భూమికి బహిరంగ కౌలు వేలం జరుగుతుందన్నారు. ఈ ఏడాది నుండి మూడేళ్ళ కాలపరిమితికి కౌలుకు తీసుకోదలచిన రైతులు రూ.5 వేలు దరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు. వేలం నిబంధనల మేరకు హెచ్చు పాటదారుకు కౌలు ఖరారు చేయబడుతుందన్నారు. ధరావత్తు పోను మిగిలిన మొదటి ఏడాది కౌలు మొత్తమును వెంటనే చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఏడాది ఏప్రియల్ మాసంలో ఈ ఏడాది కౌలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రొంపిచర్ల మసీదులో ఇఫ్తార్ విందు



రొంపిచర్ల: పవిత్ర రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్షలు పాటిస్తున్న ముస్లిం సోదరులకు మండల వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చపారపు గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు అందించారు. స్థానిక మసీదులో ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ముస్లిం సోదరులకు ఆయన ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ముస్లింలతో పాటు వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, పడాల హనిమిరెడ్డి, గెల్లి కోటిరెడ్డి పాల్గొన్నారు.

శావల్యాపురం బ్యాంకు శాఖకు ప్రథమస్థానం

శావల్యాపురం: చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు శాఖ ఖాతాదారుల సహకారంతో మిగిలిన బ్రాంచ్ శాఖల కంటే శావల్యాపురం బ్రాంచ్ శాఖ ప్రథమ స్థానంలో రావటం చాలా సంతోషంగా ఉందని బ్రాంచ్ మేనేజరు వలేటి శివకృష్ణ అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు శాఖలు 265 ఉండగా అందులో భాగంగా శావల్యాపురం బ్యాంకు శాఖ అన్నీ రంగాల్లో ముందంజలో ఉండటంతో పాటు 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 6 కోట్ల 83 లక్షల లాభాల బాటలో పయనించుతుందన్నారు. డిపాజిట్స్. రుణాలు మంజూరు, రుణాలు రికవరీ, దీర్ఘకాలిక బకాయిలు వసూలు చేయటంతో పాటు మంచి పురోగతితో రూ. 218 కోట్లు ఆర్థిక లావాదేవీలు సాధించినట్లు వెల్లడించారు.

అధికంగా పింఛన్లు ఇచ్చిన ఘనత జగనన్నదే

- అబద్ధాల అరవిందబాబు వ్యాఖ్యలు ఆలోచనా రహితం
- ప్రస్తుత పరిస్థితులకు చంద్రబాబే బాధ్యత వహించాలి
- ఎమ్మెల్యే, అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్రంలో గత ఐదేళ్ల కాలంలో అంతకు ముందుకంటే 27 లక్షలమందికి అధికంగా సామాజిక పింఛన్లు అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే, అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయే నాటికి 39 లక్షల మందికి పింఛన్లు ఇచ్చేవాడన్నారు. అప్పటి ఎన్నికల సందర్భంగా సీఎం జగన్ తాను అధికారంలోకి వస్తే ఒక్కొక్కరికీ రూ.2 వేలు పింఛన్ ఇస్తానని ప్రకటించగానే బాబు 2019 జనవరి, ఫిబ్రవరి, మార్చి నెల్లలో ఒక్కొక్కరికీ రూ.2 వేలు పింఛన్ అందజేశారన్నారు. నెలకు రూ.400 కోట్లు మాత్రమే ఖర్చుచేసే వారనీ, ఇప్పుడు 2024 నాటికి 66 లక్షల మంది పింఛన్లు తీసుకుంటున్నారన్నారు. ఇప్పుడు ఒక్కొక్కరికీ రూ.3 వేలు చొప్పున నెలకు రూ.1800 కోట్లు ఖర్చుచేస్తున్నారన్నారు. దీంతో రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఆరోగ్య పింఛన్లు ఇస్తున్నారని వివరించారు. పక్షవాత రోగికి నెలకు రూ.5 వేలు, కిడ్నీ వ్యాధితో డయాలసిస్ చేయించుకునే వారికి రూ.10 వేలు ఇస్తున్నారన్నారు. అదేవిధంగా పింఛన్లు ఇస్తుండగా ఏమాత్రం అవగాహన లేకుండా సబ్జెక్ట్ లేకుండా స్థానిక టీడీపీ అభ్యర్థి అరవిందబాబు 27 లక్షల పింఛన్లు తొలగించినట్లుగా అబద్ధపు మాటలు మాట్లాడుతున్నాడని పేర్కొన్నారు. తను ఏమీ మాట్లాడినా ఓ పద్ధతి అంటూ ఉండదన్నారు. కనీసం విషయం తెలుసుకునే పని చేయడన్నారు. ఎన్నికల సందర్భంగా పింఛన్ల పంపిణీపై చంద్రబాబు చేసిన ఫిర్యాదు కారణంగా సచివాలయాలకే వచ్చి తీసుకోవాల్సిన అగత్యం పండుటాకులకు ఏర్పడిందన్నారు.

ప్రస్తుతం నెలకొన్న పింఛన్‌దార్ల సమస్యలకు చంద్ర బాబునాయుడే కారణమని వివరించారు. ఆరుగురు పండుటాకులు చనిపోయారని, దీనికి బాధ్యత చంద్రబాబే వహించాలన్నారు. నిమ్మగడ్డ రమేష్ కుమార్ చేసిన ఫిర్యాదు మేరకు ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. దీనిని వారి రాజమండ్రి అభ్యర్థి ఆదిరెడ్డి వాసు సమర్ధించారన్నారు. గతంలో మళ్లీ సీఎం జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకుంటే ఇళ్లకే పింఛన్లు అందుతాయని చెప్పారు.

ఎల్లో రాతలు సమాజానికే అరిష్టం

ఇటీవల ఎన్నికల కమిషన్ కొన్ని జిల్లాలకు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల మార్పులు, చేర్పులు చేయటంపై ఒక టీడీపీ అనుకూల పత్రిక శుక్రవారం వీరు కూడా వైసీపీకి అనుకూలమేనంటూ బ్యానర్ ఐటమ్‌గా రాయటం సమాజానికి ఏమి సందేశం ఇస్తున్నారని డాక్టర్ గోపిరెడ్డి ప్రశ్నించారు. ఎన్నికల కమిషనర్ ప్రతి జిల్లాకు ముగ్గురు పేర్లలో ఒకరి పేరును ప్రకటించి నియమించటం జరిగిందన్నారు. దీనిని తప్పుబట్టి వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అంటగట్టడం చూస్తుంటే వారి దుర్మార్గం తెలుస్తుందన్నారు. 30 మంది ఐఏఎస్‌లను మార్చాలని బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి ఎన్నికల కమిషన్‌కు లెటర్ రాయటం విడ్డూరమన్నారు. వీరి రాతలను బట్టి ప్రభుత్వం సూచించిన వారినే ఎన్నికల కమిషన్ నియమిస్తుందని పేర్కొంటున్నారన్నారు. ఇటువంటి వాటిని ప్రజలు తిరస్కరించాలని కోరారు.

వైఎస్సార్ సీపీలోకి..



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: నియోజకవర్గంలోని రొంపిచర్ల మండలం తుంగపాడు గ్రామానికి చెందిన 15 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరడం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే, అసెంబ్లీ అభ్యర్థి గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో వారందరికీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై 15 కుటుంబాలు పార్టీలో చేరాయన్నారు. గత ఐదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం అంటే ఏంటో చూశామని టీడీపీ వారే స్వయంగా చెబుతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల ద్వారా ఆ పార్టీ నాయకులకు మాత్రమే న్యాయం జరిగిందన్నారు. కనీసం కార్యకర్తలకు కూడా న్యాయం జరగలేదని వారే చెబుతున్నారన్నారు. ఒక వాలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ కార్యక్రమాలను వారి గడపకు తీసుకెళ్లడంలో సూపర్ సక్సెస్ అయ్యామని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారందరికీ భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తామని అన్నారు. వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

జగనన్న హయాంలోనే ప్రతిఇంటా అభివృద్ధి ఫలాలు

- వైఎస్సార్‌సీపీ చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు
- పట్టణంలోని 26వ వార్డులో పర్యటన
- ఉత్సాహంగా సాగిన ఎన్నికల ప్రచారం
- ఘనస్వాగతం పలికిన వార్డు ప్రజలు



నమస్తే అమ్మా: స్థానికులకు నమస్కరిస్తున్న కావటి మనోహర్ నాయుడు

చిలకలూరిపేట: తన సుపరిపాలనా విధానాలతో ప్రతిఇంటా అభివృద్ధి ఫలాలు అందించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు సీఎంను చేసుకుందామని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు చెప్పారు. పట్టణంలోని 26వ వార్డులో ఎన్నికల ప్రచారం శుక్రవారం గడపగడపకు నిర్వహించారు. వార్డుకు విచ్చేసిన కావటి మనోహర్ నాయుడిని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పూలమాలలు వేసి ఘనస్వాగతం పలికారు. ముందుగా వార్డు కౌన్సిలర్ చెంబేటి భారతితో కలిసి వార్డులోని గ్రామదేవత పోలేరమ్మ, కనకదుర్గమ్మ గుళ్లలో పూజలు చేశారు. అనంతరం గడియార స్తంభం వద్ద నుంచి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండే ఎండలోనూ పార్టీ శ్రేణులతో ఎంతో ఉత్సా హంగా వడ్డెరపాలెం, గుండయ్యతోట ప్రాంతాల్లో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి చిలకలూరిపేట వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా తనను, నరసరావుపేట పార్టీ ఎంపీ పి.అనిల్‌కుమార్ యాదవ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ రాజకీయ చరిత్రలో ఎవరికీ సాధ్యం కాని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని అందిం చార న్నారు. ఆయా సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడి జీవితంలో వెలుగులు నింపాయన్నారు. ఎన్నికల సమయంలో కల్లబొల్లి మాటలతో వస్తున్న చంద్రబాబుకు ఓటుతో తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీలను రాష్ట్ర ప్రజలు మడతపెట్టి మూల న పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రజలందరీ ఆశీస్సులతో రానున్న ఎన్నికల్లో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి సంక్షేమ, అభివృద్ధి పనుల్ని మరింత విస్తృతం చేస్తారని హామీ ఇచ్చారు. ప్రచారంలో ఆయన వెంట ముస్లింమైనార్టీ విభాగ రాష్ట్ర కార్యదర్శి షేక్ అల్లీ మియా, పార్టీ పట్టణ అధ్యక్షులు తలహాఖాన్, మాజీ అధ్యక్షులు ఏపీఎం సుభాని, మున్సిపల్ వైఎస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు చెంబేటి భారతీ, అన్నపరెడ్డి శ్రీలక్ష్మి, తోట నాగలక్ష్మి, కె.రమణీబాయి, షేక్ యూసుబ్ ఆలి, నాయకులు బక్షు మేస్త్రీ, తన్నీరు బ్రహ్మయ్య, చల్లా శ్రీను, గుంజి పద్మ, పల్లపు మల్లేశ్వరి, బత్తుల యశ్వంత్ బాబు, సురేష్, కోటానాయక్, మారుబోయిన నాగరాజు, ములకలూరి నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.



మీవెంటే మేమన్నా: మనోహర్ నాయుడికి కరచాలనం చేస్తున్న దివ్యాంగుడు

గత ఐదేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి

నాదెండ్ల: మీ కుటుంబంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వల్ల మేలు జరిగిందంటేనే తనకు ఓటేయండని అడుగుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చిలకలూరిపేట వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్‌నాయుడు చెప్పారు. మండలంలోని తూబాడు గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. నాడు-నేడు ద్వారా గ్రామంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతి పేదవాడికి ఉచిత వైద్య సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. తనకు, నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థి కె.అనిల్‌కుమార్‌యాదవ్‌ను ఓట్లు వేసి ఆశీర్వదించి మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మస్తాన్‌రావు, ఎంపీపీ తలతోటి రాణి, సర్పంచ్ గోళ్ళమూడి కాశియ్య, వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ గొంటు శ్రీనివాసరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ అల్లడి రవి కుమార్, మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి, నాదెండ్ల, గణపవరం సొసైటీ చైర్మన్లు కురుకుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, కోఆప్షన్ మెంబర్ మూసా, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జానీబాషా, నాయకులు విక్రమ్‌రాజు, గొర్రె శివ, పత్తి వెంకట్, టీజే రత్తయ్య, సింగారెడ్డి కోటిరెడ్డి, పర్వతనేని బ్రహ్మయ్య, ఉడతా వెంకటేశ్వరరావు, గద్దె కోటయ్య, సచివాలయ కన్వీనర్ సిరిబోయిన గోపీ, ఏరువ సుందరరెడ్డి, చిన్నపరెడ్డి, మహేంద్రరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఖాజావలి, మాజీ ఎంపీటీసీ మస్తాన్, కోయలమూడి సాంబశివరావు, మాజీ సర్పంచ్ నర్రా మేరయ్య ఉన్నారు.

మహనీయుడు డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రామ్

సేవలను స్మరించి నివాళులర్పించిన నేతలు, అభిమానులు



వినుకొండలో నివాళులర్పిస్తున్న అయోధ్య రామిరెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, బ్రహ్మనాయుడు



నరసరావుపేటలో నివాళులు అర్పిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి.

నరసరావుపేట: దేశ తొలి కార్మికశాఖ మంత్రిగా, ఉపప్రధానిగా ప్రజలకు అనేక సేవలు అందజేసిన మహనీయుడు డాక్టర్ బాబూజగజ్జీవనరామ్ అని ఎమ్మెల్యే, అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జగజ్జీవనరామ్ జయంతిని పురస్కరించుకొని పల్నాడురోడ్డులోని ఏరియా హాస్పిటల్‌కు ఎదురుగా ఉన్న విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కేంద్ర మంత్రివర్గంలో అనేక మంత్రిపదవులు చేపట్టి కార్మికులకు ఈఎస్ఐ, పింఛన్ లాంటి పథకాలను అమలు చేయించారన్నారు. బీహార్‌లోని ఒక సాధారణ పేద కుటుంబంలో జన్మించిన ఆయన దేశానికి తన జీవితాంతం సహాయ సహకారాలు అందజేశారని నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ముదిరాజు, మాదిగల కార్పొరేషన్ డైరెక్టర్లు ఐయం.స్వామి, కందుల ఎజ్రా, సీమాంధ్ర డ్రగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కేపీ రంగారావు, మాజీ కౌన్సిలర్ చల్లగుండ్ల సతీష్, కుక్కల పోలు పాల్గొన్నారు.

వినుకొండ(నూజెండ్ల): స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, నరసరావుపేట పార్లమెంటు అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజలకు జగ్జీవన్‌రామ్ చేసిన సేవలను కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నరసరావుపేట ఈస్ట్: భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 116వ జయంతిని శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కాకాని సుధాకర్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ డాక్టర్ జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాస్టర్ పి.ఫిలిప్, సంతమాగులూరు ఎంఈఓ కోటేశ్వరరావు, శ్రీనాథ సాహితీ పరిషత్ అధ్యక్షుడు స్వర్ణ చినరామిరెడ్డి, ఆంగ్లోపన్యాసకులు ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కావటి మనోహర్‌నాయుడు

చిలకలూరిపేట: బాబు జగ్జీవన్‌రామ్ వంటి మహనీయుల బాటలో పయనిద్దామని ..నేటితరం యువత విద్యార్థులు మహనీయుల జీవిత విశేషాలను తెలుసుకోవాలని... సమాజానికి సేవ చేయాలని వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు సూచించారు. పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న పార్టీ కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ముందుగా జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు బొల్లెద్దు చిన్న, మద్దిరాల విశ్వనాథం, మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, నాయకులు మైలా రాజేష్, బండారు దాసు, బండారు జయకుమార్, బందెల శ్రీను, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు సయ్యద్ సిరాజ్, సాపా సైదావలి, షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.



శావల్యాపురంలో నివాళి అర్పిస్తున్న నాయకులు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో స్వాతంత్ర్య సమరయోధుడు సామాజిక సమానత్వం కోసం అణగారిన వర్గాల అభ్యున్నతి పోరాట యోధుడు డాక్టరు బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ నాయకులు సారథ్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సెంటర్లో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. దళితులు అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు కొనియాడారు. ఈకార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మల్లాపరపు రాజశేఖర్, కందుకూరి శ్యాంబాబు, ముట్లూరి నాగరాజు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాలు తనిఖీ



వాహనాలు తనిఖీలు చేస్తున్న రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై సురేష్

శావల్యాపురం: రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వాహనాలు తనిఖీలు పోలీసులు ముమ్మరంగా చేస్తున్నట్లు వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కృష్ణాపురం గ్రామ సమీపాన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలో వాహనాలు తనిఖీలు పోలీసులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ సుధాకర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు, బంగారం తదితరవన్నీ రవాణా చేస్తున్న వాటిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. అక్రమ మార్గంలో మద్యం సీసాలు రవాణా చేయటం చట్ట రీత్యా నేరమన్నారు. వాహనాల తనిఖీలో ఎస్సై చల్లా సురేష్, సీఐఎస్ఎఫ్ పోలీసు బలగాలు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నరసరావుపేట రూరల్: అల్లూరివారిపాలెంరోడ్డులోని శ్రీ మానసాదేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల ఆలయ పంచమ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి, స్వామి వారికి విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం లక్ష్మీగణపతి పూజ, నవగ్రహ పూజ, మానసాదేవి, సుబ్రహ్మణ్యేశ్వర కాలభైరవ హోమములు నిర్వహించారు. మధ్యాహ్నం వల్లిదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కల్యాణం ఘనంగా జరిపారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అమ్మవారు, స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఎమ్మెల్యే వెంట ఏపీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కెవి పురుషోత్తమరావు, లింగంగుంట్ల మాజీ సర్పంచ్ పొన్నపాటి విజయకృష్ణారెడ్డి ఉన్నారు. నిర్వాహకుడు రంగావఝల కోటేశ్వర శాస్త్రీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

ఘనంగా రాజసూయ యాగం

ముఖ్యఅతిథులుగా పాల్గొన్న అయోధ్యరామిరెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



యాగంలో పాల్గొన్న అయోధ్యరామిరెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్రంలో మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని తలపెట్టిన రాజసూయ యాగంలో రాజ్యసభ్య సభ్యులు అయోధ్యరామిరెడ్డి, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొని పూర్ణాహుతి గావించారు. పట్టణంలోని సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో వేద మంత్రాల నడుమ నిర్వహించిన రాజసూయ యాగంలో పాల్గొన్న అతిథులకు నిర్వాహకులకు ఘన స్వాగతం పలికారు. రాష్ట్రం సుభీక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజలందరికి మేలు జరగాలని కోరారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పది మూల్యాంకనంలో పొరపాట్లు చేయవద్దు

జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట ఈస్ట్: ప్రకాష్‌నగర్‌లోని సెయింటాన్స్ పాఠశాలలోని మూల్యాంకన కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. మూల్యాంకన ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీంచి ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కేంద్రంలోని ఏర్పాట్లు పరిశీలించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు కేంద్రంలోని ఏర్పాట్లను కలెక్టర్ శివశంకర్‌కు వివరించారు.

రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీలలో బహుమతులు



బహుమతులు సాధించిన క్రీడాకారులతో కోచ్ సైదా

నరసరావుపేట రూరల్: విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీలలో పట్టణానికి చెందిన శ్రీ బాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు పలు బహుమతులు సాధించినట్టు కోచ్ ఎస్‌కె సైదా తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు యంగ్‌స్టార్స్ ఓపెన్ బాడ్మింటన్ ఛాంపియన్ షిప్ రాష్ట్రస్థాయి పోటీలలో అకాడమీ క్రీడాకారిణీలో అండర్-17 సింగిల్స్, అండర్-15 సింగిల్స్ విభాగంలో తృతీయ బహుమతి, అండర్-15 డబుల్స్ విభాగంలో ద్వితీయ బహుమతి సాధించినట్టు తెలిపారు. అలాగే అండర్-13బాలుర డబుల్స్ విభాగంలో పి.చరణ్, హర్షవర్ధన్ ప్రథమ బహుమతి, అండర్-11 బాలుర డబుల్స్ విభాగంలో అమర్, హేమవర్ధన్‌లు ద్వితీయ బహుమతి సాధించినట్టు వివరించారు.

పీహెచ్‌సీని సందర్శించిన ఎన్‌క్యూఎస్ బృందం



ఎన్‌క్యూఏఎస్ బృందంతో వైద్యులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు

రొంపిచర్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం నేషనల్ క్వాలిటీ ఏష్యూరెన్స్ స్టాండెడ్స్ (ఎన్‌క్యూఏఎస్) అధికారుల బృందం సందర్శించారు. నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాంలో భాగంగా ఢిల్లీ నుంచి ఈ బృందం వచ్చింది. ఈ బృందంలో డాక్టర్ వాసంతి, డాక్టర్ అనోజ్‌లు పాల్గొన్నారు. వైద్యశాల్లో ఉన్న పరికరాలు, మందులు, రికార్డులను పరిశీలించారు. అలాగే వైద్యుల నుంచి రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. వైద్యసిబ్బంది అందించాల్సిన పలురకాల సేవలపై వారు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాంప్రసాద్, స్థానిక వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.